పారిపోయిన హంతకుడు

టెంపోరావ్

పట్నానికి చివరగా వున్న దేశాయి నగర్‌లోని చిన్న బంగ్లా ముందు ఆగింది సైకిల్ రిక్షా. అతడు కిందకు దిగకుండా, సీటుమీద కూర్చుని "చంద్రా! చంద్రా!" అని బిగ్గరగా అరిచాడు.

ఎవ్వరూ రాలేదు. పక్కనే నిలబడిన రిక్షావాడు యింటివైపు చూసి అతడి వంక తిరిగాడు.

"ముందు తలుపుకు తాళంవేసుంది సార్" అన్నాడు.

అతడు ఆశ్చర్యంగా కిందకు దిగాడు. నొప్పిగావున్న ఎడంకాలివైపు చూసి మెల్లిగా గుమ్మం ముందుకు నడిచాడు. గాడ్రెజ్ తాళం!

"సార్, డబ్బిచ్చి నన్ను పంపేయండి!" అరిచాడు రిక్షావాడు.

అతడు జవాబివ్వలేదు. జేబులోంచి తాళంచెవి తీసి, తెరిచి లోపలకు వెళ్ళాడు. అతడి బాగ్ పట్టుకుని రిక్షా వాడు వచ్చాడు.

రిక్షావాడి చేతిలోని బాగ్‌ను అతడు తీసుకొన్నాడు. జేబులోంచి మూడు రూపాయలు తీసి అతిడికిచ్చాడు.

అతడు మెల్లిగా పడగ్గది వైపు నడిచాడు. గడపదాటి అతడు లోపలకు చూసి అమాంతంగా అర్చాడు.

"చంద్రా!"

ఆ అరుపు విని రిక్షావాడు పరుగెత్తుకొచ్చాడు. మంచంముందు రక్తం మడుగులో పడున్న స్త్రీ వంక చూశాడతను.

"నా భార్య చంద్రను ఎవరో హత్యచేశారు!" అన్నాడతను.

రిక్షావాడు భయంతో శవంవైపు చూసి వెనక్కు తిరిగాడు.

"బస్‌స్టేండ్‌కు వెళ్తున్నావుగా! అక్కడున్న పోలీసు స్టేషన్‌లో రిపోర్టియ్యి. నా పేరు గోపాలరావు. నెంబర్ 8 పదో వీధి, దేశాయి నగర్ నా అడ్రెసు."

"మీరు వుత్తరం రాసి యివ్వండి. పోలీస్‌స్టేషన్‌లో యిస్తాను."

గోపాలరావు ఖంగారుగా గదిలో అటూ యిటూ తిరిగాడు. లెటర్ హెడ్‌మీద క్లుప్తంగా రాసి రిక్షావాడి కిచ్చాడు.

"ప్లీజ్! ఇది వెంటనే స్టేషన్‌లో ఇయ్యి. ఈ ప్రాంతంలో టెలిఫోన్‌లు లేవు. నేను అక్కడదాకా నడవలేను" అన్నాడతను.

"యిస్తాను సార్" అన్నాడు రిక్షావాడు.

రిక్షావాడికి మరో రూపాయి తీసి యిచ్చాడు గోపాలరావు. రిక్షా వెళ్ళిపోయింది.

హాల్లోని సోఫాలో కూర్చుని గోపాలరావు సిగరెట్

వెలిగించాడు. అతడి కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి. పొగ పీల్చి, బయటకు వదిలి, అతను సిగరెట్‌ను హాల్లో మూలకు విసిరాడు.

అతడు టైమ్‌చూసి మెల్లిగా ఇంటిముందుకు వెళ్ళాడు. సమీపంలో యిళ్లు లేవు. పక్క స్థలాల్లో పునాదులువేసి వదిలేశారు. జనతా ప్రభుత్వం వచ్చాక దేశాయి నగర్ రూపందాల్చింది. ఆ ప్రభుత్వం పడిపోగానే దేశాయి నగర్‌మీద ప్రజల ఆసక్తి తగ్గిపోయింది. దూరంలో వున్న ఇందిరా నగర్‌కి డిమాండ్ పెరిగింది.

రోడ్డువెపు చూస్తూ నిలబడ్డాడు గోపాలరావు. రోడ్డు మీద ఎక్కువగా జనసంచారంలేదు.

అతడు తన ఎడంకాలు వైపు చూశాడు. బొటన వేలుమీద ప్లాస్టర్ వేసివుంది. అడుగు వేస్తూంటే నొప్పిగా వుంది.

రిక్షావాడు స్టేషన్‌కి వెళ్ళాడో, లేదో! ఆలోచిస్తూ పిట్టగోడు వారగా అతడు నిలబడ్డాడు.

2

పడకకుర్చీలో కూర్చుని చుట్ట కాల్చుకుంటూన్న డిటెక్టివ్ వాలి ఎదురుగా ఆసీనుడైన గిరి వంక చూశాడు.

"ఆమె గురించి ఏం తెల్సుకున్నావు?" అడిగాడు వాలి.

గిరి జవాబిచ్చేలోగా టెలిఫోన్ మ్రోగింది. వాలి పక్కనున్న రిసీవర్ని అందుకున్నాడు.

"హలో, వాలి స్పీకింగ్!"

"వాలిగారూ, నేను ఇన్స్పెక్టర్ రామదాస్‌ని."

"రామదాస్ భాయ్, ఏమిటి సంగతి?"

"దేశాయి నగర్‌లో ఏదో హత్య జరిగిందని రిపోర్టు

వచ్చింది. దయచేసి మీరు అక్కడికొస్తే సంతోషిస్తాను."

"ఎక్కడుంది?"

"కామరాజ్ నగర్‌కి కొంచెందూరంలో వుంది సార్. పదో వీధి, నంబర్ 8 యింట్లో హత్య జరిగిందట."

"ఆల్ రైట్, వస్తాను" అని వాలి రిసీవర్ని పెట్టేశాడు.

పడక కుర్చీలోంచి లేచాడు వాలి.

"గిరి, వెళ్దాం పద!"

ఇద్దరూ బయటకు నడిచారు. హోటల్ గది తలుపు మూసి గిరి లాక్ చేశాడు.

XYZ కారు దేశాయి నగర్ రోడ్డమ్మట వెళ్తోంది.

"ఇది ఆరో వీధి. పదో వీధి అటువైపు వుండొచ్చు" అన్నాడు వాలి.

గిరి కారును పోనిస్తున్నాడు. అన్నీ చిన్న బంగళాలు. ఎక్కడా మేడలు లేవు. పోలీసు జీప్ దూరంలో కనిపిస్తోంది. అటువైపు కారును పోనిచ్చాడు గిరి.

కొందరు ప్రజలు అక్కడ పోగయ్యారు. జీప్ వెనకనే గిరి కారును ఆపాడు—వాలి కిందకు దిగాడు.

ఇన్‌స్పెక్టర్ రామదాస్ వేగంగా వాలిముందు కొచ్చాడు.

"నమస్కారం, వాలిగారూ! అడగ్గానే యిక్కడకు వచ్చినందుకు మీకు నా ధన్యవాదాలు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

చుట్టపాగ పీల్చివదుల్తూ వాలి నలువైపులా చూశాడు. రోడ్డు వారగా కొందరు ప్రజలు నిలబడి గోపాలరావు యింటివైపు చూస్తున్నారు. ఎనిమిదో నంబరు బంగళా

కిరువైపులా యిళ్ళు లేవు. ఎదురుగా యిళ్ళులేవు.

ఇటువంటి ప్రదేశంలో జీవించేవాళ్ళు ధైర్యవంతులై వుండాలి!

"పదండి లోపలకు!" అన్నాడు ఇన్ స్పెక్టర్ రామదాస్.

వాలి లోపలకు వెళ్ళాడు. ఇన్ స్పెక్టర్ రామదాస్ వెనకనే గిరి హాల్లోకి నడిచాడు. చిన్న హాలు. హాల్లో రెండు చిన్న సోఫాలు, ఒక పెద్ద సోఫా వుంది.

సోఫాలో కూర్చున్న గోపాలరావు లోనకొచ్చిన వారిని చూసి లేచినిలబడ్డాడు.

"ఆయన గోపాలరావుగారు!" ఇన్ స్పెక్టర్ రామదాస్ పరిచయం చేశాడు.

పడగ్గదిలోకి వాలితో నడుస్తూ ఇన్ స్పెక్టర్ రామదాస్ చెప్పుకుపోయాడు! "వాలిగారూ, ఆయన భార్య చంద్రమతిని ఎవరో హత్యచేశారు."

పడగ్గదిలో చుట్టు కాలుస్తూ నిలబడ్డాడు వాలి. మంచంముందు గచ్చు నేలమీద వెల్లకిలా పడున్న స్త్రీ వైపు చూశాడు. ఆమె ధరించిన గుడ్డలు రక్తమయంగా వున్నాయి. ఆమె ఒంటిమీద ఒక నగ కూడా లేదు. మంగళసూత్రం కూడా మాయమైంది!

శవాన్ని వాలి పరీక్షగా చూశాడు. ఆమె మెడ నరికివేయబడింది. ఆమె కాళ్ళవైపు అతడి చూపు వెళ్ళింది. ఆమె కుంటిదని వాలి తెలుసుకున్నాడు.

గది నలువైపులా చూశాడు వాలి. మంచంపైన పరుపు, తలగడలు వున్నాయి. గోడవారగా గాడ్ రెజ్ బీరువా వుంది. మరోవైపున బట్టల స్టేండ్ వుంది. గోడకు వాళ్ల పెళ్ళి ఫోటో వేళ్ళాడుతోంది.

దగ్గరగా వెళ్ళి ఆ ఫోటో వంక చూశాడు వాలి. హాల్లో కూర్చున్న గోపాలరావు ఫోటోలో వున్నట్టే కనిపిస్తున్నాడు. వాళ్ళ పెళ్ళయి ఎక్కువ కాలం అయి వుండదు.

ఆలోచిస్తూ వాలి శవం పక్కనే గొంతు కూర్చుని పరీక్షగా చూశాడు. ఆమె చెయ్యిని ముట్టుకొని, మెల్లిగా లేచి నిలబడ్డాడు.

చంద్రమతి అంత అందమైన స్త్రీ కాదు. దానికి తోడు కుంటిది. గోపాలరావు అందంగా యవ్వనంలో వున్నాడు. వాళ్ళిద్దర్నీ విధి ఎలా కలిపింది?

ఆలోచిస్తూ వాలి వెనక్కి తిరిగాడు. అప్పుడే వచ్చిన డాక్టర్ సుధాకర్ వాలికి నమస్కరించాడు.

చిరునవ్వుతో వాలి హాల్లోకి వెళ్ళాడు. ఒక కానిస్టేబుల్ గుమ్మం బయట నుంచుని వున్నాడు.

గోపాలరావు లేవబోయాడు.

"అబ్బాయి, కూర్చో!" అన్నాడు వాలి.

గోపాలరావుకు ఎదురుగా వెళ్ళి వాలి నిలబడ్డాడు. అతడి నోట్లో చుట్ట వెలుగుతోంది. మెల్లిగా పొగ బయట కొస్తోంది.

"నువ్వు ఏ కంపెనీలో పనిచేస్తున్నావు?"

"రావు అండ్ రవూఫ్ అడ్వర్టైజింగ్ కంపెనీలో సార్. రవూఫ్, నేనూ ఆ కంపెనీలో భాగస్వాములం" అన్నాడు గోపాలరావు.

"జరిగినదంతా వివరంగా చెప్పు!"

"ఇవాళ పొద్దుట కాఫీ తాగి నేను ఆనంద్ నర్సింగ్ హోమ్‌కి వెళ్ళాను. చాలాకాలంనుంచి ఇన్‌గ్రోన్ గోరుతో నేను బాధ పడుతున్నాను. ఎడం కాలి బొటనవేలు

తీసేశారు. అటుపైన నేను నర్సింగ్ హోమ్ గదిలోనే ఉన్నాను. ఒంటి గంట లోపల చంద్ర భోజనం కేరియర్‌లో పంపుతానంది. కాని పంపలేదు. నర్సింగ్ హోమ్ కాంటీన్‌లో నేను భోజనం చేశాను. డాక్టర్ ఆనంద్ ఐదింటికి నన్ను చూసి యింటికి పోవచ్చన్నారు. నేను బస్సులో ప్రయాణంచేసి, బస్టేండునుంచి రిక్షాలో యింటికొచ్చాను."

"నువ్వు ఇంటికొచ్చేసరికి టైమ్ ఎంతయింది?"

"5-45 అయింది. ముందు తలుపుకు తాళంవేసివుంది. చంద్ర ఎక్కడికో వెళ్ళి ఉంటుందనుకుని నా జేబులో వున్న తాళంచెవితో తెరిచి లోపలకు వెళ్ళాను. చంద్ర శవాన్ని చూసి హడలిపోయాను. రిక్షావాడి ద్వారా పోలీస్ స్టేషన్‌కి రిపోర్టు రాసి పంపాను."

గోపాలరావు ఆగాడు. కన్నీళ్ళు కారుతున్న కళ్ళను తుడుచుకున్నాడు. వెనుక నిలబడిన గిరి అతడి భుజం మీద చెయ్యి వేశాడు.

"గోపాలరావుగారూ, ధైర్యం తెచ్చుకోండి" అన్నాడు గిరి.

క్షణకాలం వాలి చుట్ట పీలుస్తూ మౌనంగా ఉండి పోయాడు. ఎదురుగా ఉన్న బుగ్గమీసాల వ్యక్తివైపు గోపాలరావు గాభరాతో చూశాడు.

"అబ్బాయి, ఈ యింట్లో మీరిద్దరుకాక మరెవరుంటున్నారు?"

ఆ ప్రశ్న విని గోపాలరావు తృళ్ళిపడ్డాడు. "మాతో నాగేష్ అనే నౌఖరు ఉంటున్నాడు. వాడు ఎక్కడికెళ్ళాడో!"

గోపాలరావు ఆగాడు.

"నాగేష్ ఎంతకాలంనుంచి యిక్కడ పని చేస్తున్నాడు?"

"వాడు పనిలో చేరి సరిగ్గా వారంరోజులు అయింది, సార్. ఓ రోజు మధ్యాన్నం వాడు యింటికొచ్చాడు. వంటపనీ, తతిమ్మా పనులూ చేస్తానని నా భార్యతో చెప్పాడట. ముక్కూ, మొహం తెలియనివాడికి ఆమె వెంటనే ఉద్యోగమిచ్చింది."

"నాగేష్‌కి ముందు ఎవరుండేవారు?"

"కన్నయ్య పనిచేసేవాడు. వాడు పెళ్ళిచేసుకుని పని మానేశాడు. నౌఖరు ఉంటేగాని చంద్రకు గడవదు. ఆమె కుంటిది. అందువలన నాగేష్‌కి ఇంటిపని ఇచ్చింది."

కొంచెంసేపు వాలి ఆలోచించాడు.

"ముందు గుమ్మానికి వేసిన తాళానికి రెండు చెవులు ఉన్నాయా?"

"ఉన్నాయి సార్. ఒకటి నేను ఉంచుకుంటాను. రెండోది యింట్లోనే ఉంటుంది."

వాలి సూటిగా గోపాలరావు వంక చూశాడు.

"అబ్బాయి, నీ భార్యను హత్య చేసిన వ్యక్తి ముందు తలుపుమూసి తాళంవేసి పరారీ అయ్యాడు."

గోపాలరావు వొళ్ళు భయంతో వణికింది.

"వాలిగారూ, ఆ దుర్మార్గుడు నాగేష్ యిదంతా చేసుండాలి! నాకు వాడు నచ్చలేదు. ఆ విషయం చంద్రతో కూడా చెప్పాను."

"నాగేష్ నీకెందుకు నచ్చలేదు?"

"పిల్లిలా అడుగులేసేవాడు. వంట చేస్తూ దినపత్రిక చదువుతూ వుండేవాడు! అతడంటే నాకెందుకో భయంగా వుండేది. రాత్రిళ్ళు యింటిముందు వరండా

మీద పడుకోమన్నాను."

"నాగేష్ ఎలా వుంటాడు?"

"మీడియం హైట్. తీగలాంటి నల్లటి శరీరం. నల్లటి గడ్డం. చిరిగిన దుస్తులు ధరించేవాడు. అతడు ఎక్కడ నుంచో పారిపోయివచ్చి, దిక్కులేక మా యింట్లో పనికి చేరాడని నాకనిపించేది."

"అతడిక్కడ ఏం పనులు చేసేవాడు?"

"వంటచేసేవాడు. మార్కెట్‌కి వెళ్ళి కూరలూ అవీ తెచ్చేవాడు. నా భార్య ఎక్కువగా తిరగలేదు. ఆమెకు ఆసరాగా ఉండేవాడు."

వంటగది చిందరవందరగా వుంది. గాస్ స్టవ్, పక్కనే సిలిండర్ ఉన్నాయి. పెద్ద అలమారులో ఎన్నో డబ్బాలు, బుడ్డీలు ఉన్నాయి. గోడకు అమర్చిన మెటల్ బుట్టలో గరిటెలు, అట్లకాడలు వగైరా ఉన్నాయి. నేలమీద తెలుగు దినపత్రికలు పడున్నాయి.

స్టీల్ కేరియర్‌లో అన్నం, యితర పదార్థాలు పెట్టబడి ఉన్నాయి. కుక్కర్ పాత్రల్లో అన్నం, పప్పు, పులుసు వగైరా ఉన్నాయి. గదిలో ఎంగిలి కంచాలు ఎక్కడా లేవు. వంట అయిందిగాని, ఎవ్వరూ భోజనం చేసిన సూచనలు లేవు.

ఒక బల్లమీద కొన్ని ఫోటోలు పడున్నాయి. వాటి మధ్య మురుగన్ స్టోర్ వాడిచ్చిన కాష్ బిల్లు వుంది.

బిల్లుని వాలి పరీక్షించాడు. 56-15 అయింది బిల్లు ప్రకారం అవన్నీ కొనడానికి! అవన్నీ ఎవరు కొన్నారు? పొట్లాలను విప్పలేదు. ఎవరో వాటిని కొని తెచ్చి అక్కడ పెట్టారు. మరో పనిలో నిమగ్నులై ఉండటం వలన ఆ పొట్లాలు అలాగే ఉండిపోయాయి.

గదిలోకొచ్చిన గిరివైపు చూశాడు వాలి.

"గిరీ, ఈ బిల్లు మురుగన్ స్టోర్స్ యిచ్చింది. ఈ వస్తువు లన్నీ ఎవరు కొన్నారో, ఎప్పుడు కొన్నారో కనుక్కో!"

బిల్లు పట్టుకొని గిరి బయటకు వెళ్ళిపోయాడు.

ఆరిపోయిన చుట్టను వాలి లైటర్‌తో వెలిగించాడు. నేలమీద పడున్న దినపత్రికలను తీసుకుని చూడ సాగాడు.

మొదటి పేజీలో బాక్స్ కట్టి ప్రచురించిన వార్త అతడిని ఆకర్షించింది. జనరల్ హాస్పిటల్లో ట్రీట్ మెంట్ కోసం చేర్చిన నేరస్థుడు అంకిసీడు కానిస్టేబుల్‌ను గాయపర్చి పారిపోయాడు. అంకిసీడుకోసం పోలీసులు పట్నంలో అన్నిచోట్లా గాలిస్తున్నారు.

పత్రికమీదున్న తారీఖులు చూశాడు వాలి. ఆ పత్రిక వెలువడి వారంరోజులైంది.

మరో దినపత్రికలో అంకిసీడు గురించి వివరా లున్నాయి. అంకిసీడు రాయపురంలో ఒక స్త్రీని చంపాడు. ఆమె నగలు దోచుకు పారిపోయాడు. వాటిని అమ్ముతూండగా అతడు పోలీసులకు చిక్కాడు. ఇంతకు ముందు మరికొన్ని హత్యలు చేసినట్లు పుకార్లు వున్నాయి. అతడి కేసు విచారణ యింకా కోర్టులో సాగుతోంది.

ఇన్‌స్పెక్టర్ రామదాస్ గదిలోకొచ్చాడు.

"వాలిగారూ, పన్నెండూ ఒంటిగంట మధ్య ఆమె మరణించి ఉంటుందని డాక్టర్ సుధాకర్ అంటున్నారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"రామదాస్ భాయ్, యీ పత్రికలు చూడు!" అన్నాడు వాలి.

"అందులో ఏముంది సార్?"

"పారిపోయిన క్రిమినల్ అంకినీడు గురున్నాడా?"

"అతడి కోసం మేం గాలిస్తున్నాం" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఇన్‌స్పెక్టర్ వైపు సూటిగా చూశాడు వాలి.

"ఈ పట్నంలో తలదాచుకోడానికి యీ యిల్లు కంటె మంచి చోటు అంకినీడికి ఎక్కడ దొరుకుతుంది?" అన్నాడు వాలి.

ఇన్‌స్పెక్టర్ రామదాస్ వులిక్కిపడ్డాడు.

"ఈ యింట్లో అంకినీడుకి ఆశ్రయమిచ్చారంటారా?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

"రామదాస్ భాయ్, చంద్రమతికి నౌఖరు కావాలి. పాత నౌఖరు పని మాని వెళ్ళిపోయాడు. పోలీసులకు దొరకకుండా ఎక్కడో దాగోవాలని ప్రయత్నిస్తూన్న అంకినీడు యిక్కడకు వచ్చి వుండొచ్చు."

"అంకినీడు మొహంచూస్తే వాడికి ఉద్యోగం ఎవ్వరూ యివ్వరు సార్. పేపర్లలో ఏదో చూసి మీరు వూహిస్తున్నారు!"

"ఒక్కోసారి నా వూహాలు నిజాలవుతాయి!" అన్నాడు వాలి క్లుప్తంగా.

కాస్సేపు యిద్దరూ మౌనంగా ఉన్నారు.

"రామదాస్ భాయ్, యీ గదిలో ఎన్నో పాత్రలున్నాయి. ఈ యింట్లో పనిచేసిన నౌఖరు వాటిని ముట్టుకుంటూ ఉండాలి. వేలిముద్రల కోసం పాత్రలనూ, తలుపులనూ చూడమను. అంకినీడు వేలిముద్రలతో వాటిని పోల్చి చూడ్డం మంచిది" అన్నాడు వాలి.

"అలాగే చేయిస్తాను, సార్" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

చుట్ట పీలుస్తూ వాలి ఇంటి చుట్టూ నడుస్తున్నాడు. ఎలక్ట్రిక్ లైట్లు వెల్గుతున్నాయి.

గిరి గబగబా వచ్చాడు.

"మురుగన్ స్టోర్స్‌కి వెళ్ళి అంతా కనుక్కున్నాను. గోపాలరావుగారి నౌఖరు అవన్నీ కొన్నాడట. వంద రూపాయిల నోటు ఇచ్చి తతిమా చిల్లర తీసుకున్నాడు. 12-30 నుంచి 12-45 దాకా అతడు ఆ షాపు దగ్గర ఉన్నాడట. అతడు వెళ్ళేముందు టైము అడిగితే షాపు యజమాని 12-45 అని చెప్పాడట" అన్నాడు గిరి.

కాలుతున్న చుట్టను వాలి చేత్తో పట్టుకున్నాడు. ఆలోచిస్తూ ఆగాడు.

"వాలిగారూ, మరో విషయం. వస్తువులు తొందరగా యివ్వండి, అయ్యగారికి కేరియర్ తీసుకెళ్ళాలి అని అతడు అన్నాడట!"

"గిరీ, దీన్నిబట్టి 12-45కి అమ్మాయి బ్రతికివుందని మనం వూహించాలి. చంద్రమతిని చంపి అతడు వస్తువులను కొనడానికి కొట్టుకు వెళ్ళడు" అన్నాడు వాలి.

వేగంగా హాల్లోకి పరుగెత్తాడు. ఫ్లోరసెంట్ లైట్ ప్రకాశవంతంగా వెల్గుతోంది. పెద్ద సోఫాలో గోపాలరావు బలహీనంగా పడున్నాడు. వాలిని చూసి అతడు లేచాడు.

"అబ్బాయి, నీ భార్య ఒంటిమీద చాలా నగలు వుండేవా?"

"అర డజను గాజులు, మెళ్ళో రెండు పేటల గొలుసు, కమ్మలు, మంగళ సూత్రం ఉండేవి."

ఇన్‌స్పెక్టర్ రామదాస్ అక్కడికొచ్చాడు.

"వాలిగారూ, చంద్రమతి తండ్రి రామ్మూర్తిగారు వస్తున్నారు. టెలిగ్రాం ఇప్పుడే వచ్చింది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మంచిది రామదాస్ భాయ్, హత్యచేసిన వ్యక్తి నగలను అమ్మడానికి ప్రయత్నించవచ్చు. పాన్ బ్రోకర్లనూ, బంగారం కొనే వారినీ మీరు హెచ్చరించండి. పోయిన వస్తువుల వివరాలు వాళ్ళందరిక్కీ పంపండి" అన్నాడు వాలి.

"అలాగే చేస్తాను సార్" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"హత్యకు ఉపయోగించిన ఆయుధం దొరికిందా?"

"లేదు సార్. యీ సమీపంలో వున్న ముళ్ళ పొదల్లో కూడా వెతికించాను."

"రామదాస్ భాయ్, వెనకవైపు నుయ్యి ఉంది. ఇక్కడికింకా కార్పొరేషన్‌వాళ్ళు మంచినీళ్ళను సరఫరా చేయటంలేదు. ఆ నూతిలో దిగి చూడమను!"

"అలాగే సార్. అది నాకు తట్టలేదు!" అని ఇన్‌స్పెక్టర్ రామదాస్ బయటకు వెళ్ళాడు.

చుట్ట పొగ పీల్చి గాలిలోకి వదులుతూ వాలి సోఫాలో కూర్చున్న గోపాలరావు వైపు చూశాడు.

"అబ్బాయి, నీ పెళ్ళయి ఎన్నేళ్ళయింది?"

"మూడేళ్ళయింది, సార్."

"నీ భార్యకు కంటికాలు ఎలా వచ్చింది?"

"చిన్నతనంలో అటకమీదనుంచి కిందపడిపోయిందని మామగారు చెప్పారు."

"కంటికాలున్నా ఆమెను పెళ్ళాడినందుకు నిన్ను మెచ్చుకుంటున్నాను!" అన్నాడు వాలి.

"వాలిగారూ, చంద్ర హృదయం వెన్నలాంటిది.

అదే నన్ను ఆకర్షించింది" అన్నాడు గోపాలరావు.

వాలి ఆలోచిస్తూ బయటకు నడిచాడు. రోడ్డుమీద నిలబడ్డాడు. నలువైపులా చూశాడు. పిట్టగేటు ప్రాంతంలో ఉన్నాడు గిరి.

"గిరీ!" పిల్చాడు వాలి.

గిరి నవ్వు మొహంతో దగ్గరకొచ్చాడు. ఇద్దరూ రోడ్డమ్మట మెల్లిగా నడుస్తున్నారు.

"ఏవో వస్తువులు కొనమని నౌఖరు నాగేష్‌కి ఆమె వందరూపాయలు ఇచ్చింది. హత్యచేయాలనే ఉద్దేశం ఉంటే నాగేష్ అప్పుడే ఆమెను చంపేసి, నగలూ, డబ్బూ పట్టుకు పారిపోవచ్చుగా?"

"అవును సార్."

"అతడు అలా చెయ్యలేదు. కొట్టుకెళ్ళి వస్తువులు కొని తెచ్చాడు. ఏ 12-55కో అతడు తిరిగి ఇంటికి వచ్చాడు. డాక్టర్ సుధాకర్ చెప్పిన దాన్నిబట్టి ఆమె పన్నెండూ ఒంటిగంట మధ్య మరణించింది. నాగేష్ ఇంటికి తిరిగొచ్చిన ఐదు నిమిషాల్లో యీ హత్య చేయ వలసిన అవసరం అతడికి ఎందుకొచ్చింది?" అడిగాడు వాలి.

"అవును, సార్. ఆమె భర్త ఆఫీసుకు పోయాక ఏ క్షణంలోనైనా నాగేష్ చంద్రమతిని చంపొచ్చు. కాని అతడు చంపలేదు. మురుగన్ స్టోర్స్ నుంచి తిరిగొచ్చాక చంపడానికి ఏదో కారణం ఉండాలి" అన్నాడు గిరి.

"వంటగదిలో ఉన్న పేపర్లూ అవీ చూసి అతడు హంతకుడని ఆమె గ్రహించి, అతడిని అడిగిందేమో! తన రహస్యాన్ని బయటపెడ్తుందని భయపడి అతడామెను

చంపాడేమో!"

"తార్కికంగా ఆలోచిస్తే అలా అనుకోవాలి!"

ఇద్దరూ వెనక్కి తిరిగి నడవసాగారు. వాలి అమాంతంగా ఆగాడు. చుట్ట పొగ వదులుతూ నిలబడ్డాడు.

"నాగేష్ కాక మరెవరో ఆమెను చంపివుండొచ్చు. డబ్బుకోసం! ఇక్కడ ఎక్కువ జనసంచారం లేదు. నాగేష్ కొట్టుకెళ్ళినపుడు ఎవరో ఆమెను చంపి వుండొచ్చు. ఇంటికి తిరిగొచ్చిన నాగేష్ శవాన్ని చూసి, భయపడి, తలుపు మూసి తాళం వేసి పారిపోయి ఉండొచ్చు."

"ఈ లైన్ ఆఫ్ థాట్ బాగుంది, వాలీగారూ" అన్నాడు గిరి.

ఇన్స్పెక్టర్ రామదాస్, ఒక కానిస్టేబుల్ వాళ్ళ దగ్గరకు పరుగెత్తుకొచ్చారు.

"వాలిగారూ, మీ ఐడియా పూర్తిగా ఫలించింది, సార్. నూతిలో యీ కత్తి దొరికింది" అన్నాడు ఇన్స్పెక్టర్.

కానిస్టేబుల్ చేతిలోవున్న కత్తివైపు వాలి పరీక్షగా చూశాడు. ఇరవై సెంటీమీటర్లు పొడుగ్గావుందా కత్తి. నల్లటి ప్లాస్టిక్ పిడి.

"కత్తి చాలా పదునుగా ఉంది, సార్" అన్నాడు కానిస్టేబుల్.

అందరూ హాల్లోకి వెళ్ళారు. గోపాలరావు ముందుకు నడిచాడు వాలి.

"అబ్బాయి, ఈ కత్తిని ఇంతకుముందు చూశావా?"

కత్తి వైపు అతడు పరీక్షగా చూశాడు.

"ఈ కత్తి మాది కాదు. ఇంతకుముందు నేను

చూడలేదు" అన్నాడు గోపాలరావు.

"రామదాస్ భాయ్, కత్తిమీద వేలిముద్రలు ఉన్నాయేమో చూడమను. నూతి నీళ్ళలో పడున్నందు వలన వేలిముద్రలు చెదిరిపోవచ్చు. అయినా చూడ్డం మంచిది" అన్నాడు వాలి.

ఇన్‌స్పెక్టర్ రామదాస్ తలాడించాడు.

4

రామ్మూర్తి వయస్సు అరవై దాటింది. కూతురి శవాన్ని చూసి అతడు గుండెలు బాదుకుంటూ ఏడ్చాడు.

డిటెక్టివ్ వాలి అతడిని బయటకు తీసుకెళ్ళాడు. పిట్టగోడ ప్రాంతంలో రామ్మూర్తి కెదురుగా వాలి నుంచున్నాడు.

"రామ్మూర్తీ!, నువ్వు ఎంత విచారించినా నీ కూతురు తిరిగిరాదు. కాని ఆమెను హతమార్చిన వ్యక్తిని పట్టుకోడం, శిక్షించటం మన డ్యూటీ. నువ్వు నాతో సహకరించాలి!"

"ఏం కావాలో చెప్పండి, సార్."

"నీ అల్లుడికి నువ్వు కట్నంగా చాలా ఇచ్చావా?"

"యాభై వేలిచ్చాను. పెళ్ళికి మరో యాభై వేలయింది. లక్షరూపాయిలిచ్చి నా బిడ్డకు చావును కొనిపెట్టాను!"

"నీ కూతురు హాయిగా కాపురం సాగించేదా?"

"ఆమె ఎప్పుడూ తన కష్టాల్ని గురించి నాకు రాయలేదు, సార్. చిన్నతనంలో ఆమె దేనికోసం దెబ్బలాడేదికాదు. చేతికొచ్చినదానితో తృప్తిచెందేది. ఆమె తత్వం అటువంటిది."

"గోపాలరావు గురించి ఏం చెప్పగలవు?"

"అతడి కంపెనీ బాగా నడుస్తోందని అమ్మాయి నాకు

రాసింది. ఈ ఇంటి గృహప్రవేశం జరిగినపుడే నే నొచ్చాను. నా కూతురుమీద అతడికంతగా ప్రేమ లేదని అనిపించింది."

"ఎందువలన?"

"గృహప్రవేశం సమయంలో చాలామంది వచ్చారు. అతడు తన భార్యను ఎవ్వరికీ పరిచయం చెయ్యటం నేను చూడలేదు. అతడూ, అతడి కంపెనీలో పనిచేసే గీతా ఏవో గుసగుసలాడుతూ ఉండేవారు. ఆమె అందమైన పిల్ల. చలాకీగా ఉంటుంది."

"ఈ విషయం నువ్వు నీ కూతురికి చెప్పావా?"

"లేదు, సార్. ఆమెలో అనుమానం రేకెత్తించటం ఎందుకని వూరుకున్నాను."

"అల్లుడిని అడిగావా?"

"అడగలేదు. అడిగితే అతడికి కోపంరావచ్చు. కోపంతో నా బిడ్డను నా యింటికి పొమ్మనొచ్చు. అందుకని చూసీచూడనట్లు మా ఊరికి వెళ్ళిపోయాను."

కొత్త చుట్టతీసి వాలి వెలిగించాడు. పొగ వదులుతూ రామ్మూర్తి వైపు చూశాడు.

"ఇంకా ఏమైనా నాతో చెప్పాలా?"

"వాలిగారూ, మీ పేరుప్రఖ్యాతులను గురించి చాలా విన్నాను. నా బిడ్డను చంపిన ఆ దుర్మార్గుడిని పట్టుకుని, అతడు ఉరికంబానికి ఎక్కేటట్లు చూడండి."

"చూస్తాను!" అని వాలి లోపలకు వెళ్ళాడు.

ఇన్‌స్పెక్టర్ రామదాస్ ఎదురయ్యాడు.

"వాలిగారూ, కుక్కర్, మరికొన్ని పాత్రలమీద వేలిముద్రలున్నాయి. కొన్ని వేలిముద్రలు చంద్రమతివి. తతిమ్మా ఎవరివో చూడాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మీ రికార్డులో అంకినీడు వేలిముద్రలు ఉంటాయిగా వాటితో పోల్చి చూడండి" అన్నాడు వాలి.

"అదంతా రేపు చేయిస్తాను, సార్. శవాన్ని పోస్టు మార్టమ్‌కు పంపిస్తున్నాను."

"రామదాస్ భాయ్, ఇక్కడ తెలుసుకోవలసింది ప్రస్తుతం ఏమీ లేదు. నా హోటల్‌కి వెళ్ళిపోతాను. ఆ వేలిముద్రల గురించి ఏదేనా తెలిస్తే వెంటనే నాకు చెప్పు" అని వాలి బయటకు నడిచాడు.

ఇన్‌స్పెక్టర్ రామదాస్ అతడి కూడా కారుదాకా వెళ్ళాడు.

5

డాక్టర్ ఆనంద్ ఎదురుగా వాలి కూర్చున్నాడు.

"వాలిగారూ, నా నర్సింగ్ హోమ్‌కి వచ్చినందుకు చాలా సంతోషం. ఏం కావాలో చెప్పండి" అన్నాడు డాక్టర్ ఆనంద్.

"నిన్న గోపాలరావుకి నువ్వు ఆపరేషన్ చేశావా?"

"అది చాలా మైనర్‌ది, సార్. టో నెయిల్ లోపలకు పెరుగుతోంది. లోకల్ ఎనస్తీసియా ఇచ్చి గోరు తీసేశాను. రెండుగంటలు నర్సింగ్ హోమ్‌లో రెస్టు తీసుకుని ఇంటికి పొమ్మన్నాను. కాని అతడు వెళ్ళలేదు. ఐదింటికి నేనే ఇంటికి పంపివేశాను."

"అతను ఏ గదిలో ఉన్నాడు?"

"రూమ్ నంబరు 12లో సార్."

"అతడు సాయంత్రం 5దాకా 12 నంబరు గదిలోనే ఉన్నాడని చెప్పగలవా?"

డాక్టర్ ఆనంద్ బజర్ నొక్కాడు. ఒక నర్స్ అతడి ముందుకొచ్చింది.

"రమా, గోపాలరావు నిన్న సాయంత్రం 5దాకా రూమ్ నంబర్ 12లోనే ఉన్నాడా?"

"పన్నెండింటికి ఆయన కాంటీన్ కి వెళ్లారు. మళ్లా ఎప్పుడు తిరిగొచ్చారో నాకు తెలియదు. రెండింటికి అటువైపు వెళ్లాను. అప్పుడాయన గదిలోనే ఉన్నారు."

"గోపాలరావు ఎప్పుడు గదికి తిరిగివచ్చినదీ మరెవరైనా చూశారేమో!" అన్నాడు వాలి.

"పన్నెండునుంచి రెండుదాకా మాకు లంచవర్, సార్. ఆ సమయంలో నర్సులు ఎవ్వరూ ఉండరు" అందామె.

"డాక్టర్ ఆనంద్, చాలా థాంక్స్" అని వాలి కుర్చీలోంచి లేచి బయటకు నడిచాడు. నర్సింగ్ హోమ్‌లో చాలా గదులున్నాయి. నర్సింగ్ హోమ్ లాడ్జింగ్ హౌస్ గా అగుపిస్తోంది.

మెట్లు దిగి వెనుకనున్న కాంటీన్ లోకి వెళ్లాడు వాలి. కాంటీన్ మేనేజర్ నవ్వుతూ వాలికి నమస్కరించాడు.

"అబ్బాయి, రూమ్ నెంబర్ 12లో ఉండే గోపాలరావు నిన్న ఇక్కడ లంచ్ తీసుకున్నాడా?"

అతడు ఒక పుస్తకం పేజీలు తిప్పి చూశాడు.

"తిన్నారు సార్. ఒంటిగంట దాటాక ఆయన లంచ్ కి వచ్చారు."

"మీరు బయటవాళ్ళకు ఇక్కడ టిఫినూ, భోజనం అమ్ముతారా?"

"అమ్మం సార్. ఈ నర్సింగ్ హోమ్‌లోని వాళ్ళూ, వాళ్ళ అతిధులూ మాత్రం ఇక్కడ తినొచ్చు. ముందుగా ఆర్డరిచ్చిన వాళ్ళకే భోజనం పెడ్తాం, సార్."

"గోపాలరావు ముందుగా ఆర్డరిచ్చాడా?"

"తొమ్మిదింటికి మా బాయ్ ప్రతి గదికీ వెళ్ళి లంచ్ కావాలా అని అడుగుతాడు. అప్పుడు ఆర్డరివ్వాలి."

చుట్ట పొగ పీల్చి వదులుతూ వాలి తన కారువైపు నడిచాడు. తన భార్య కేరియర్ పంపుతుందని తెలిసి కూడా గోపాలరావు లంచ్‌కి ముందుగా ఆర్డరివ్వటం విచిత్రంగా వుంది. కారులో కూర్చుని వాలి తలుపు మూశాడు. పన్నెండింటికి లంచ్‌కి వెళ్తున్నానని నర్సుతో చెప్పిన గోపాలరావు ఒంటిగంట దాటిందాకా ఎందుకు వెళ్ళలేదు?

ఇదంతా అగమ్యగోచరంగా వుంది. తన హోటల్ వైపు వాలి కారును పోనిచ్చాడు.

హోటల్ గదిలోకి వెళ్ళగానే ఇన్‌స్పెక్టర్ రామదాస్ నవ్వుమొహం ప్రత్యక్షమైంది. పక్కనే గిరి ఉన్నాడు.

"వాలిగారూ, యూ ఆర్ విజర్డ్! మీరు ఊహించినదంతా నిజమైంది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

పడక కుర్చీలో కూర్చుని చుట్ట పీలుస్తూ వాలి ఇన్‌స్పెక్టర్ వంక చూశాడు.

"రామదాస్ భాయ్, అంకినీడు నాగేష్ అనే పేరుతో చంద్రవతి ఇంట్లో నౌఖరుగా ఉండటం నిజమంటావు!" అన్నాడు వాలి.

"నిజం సార్. వేలిముద్రలు పోల్చిచూసి మా ఫింగర్ ప్రింట్ వాళ్ళు ఆశ్చర్యపోయారు. దానితో ఈ కేసు ముగిసినట్లే, సార్!"

వాలి గంభీరంగా నవ్వాడు.

"రామదాస్ భాయ్, యీ కేసు పరిశోధన ఇప్పటి నుంచే నిజంగా ప్రారంభమైనదనాలి! ఒక మెట్టు ఎక్క-

కలసినచోట పదిమెట్లు పైకి దూకటం మనకు మంచిది కాదు!"

"వాలిగారూ, ఏమిటి మీ రనేది? అంకినీడు హంతకుడు. చంద్రమతిని చంపి ఆమె నగల్తో పారిపోయాడు. సందేహంలేదు!"

"డాక్టర్ రిపోర్టు వచ్చిందా?" అడిగాడు వాలి.

"చంద్రమతి పన్నెండున్నర ప్రాంతంలో మరణించి ఉంటుందని తేలింది. ఆమె లంచ్ తినలేదని డాక్టర్ రిపోర్టులో వుంది."

"రామదాస్ భాయ్, 12-30 నుంచి 12-45 దాకా అంకినీడు వురఫ్ నాగేష్ మురుగన్ స్టోర్స్‌లో ఉన్నాడని నాకు తెలిసింది. అంకినీడు హంతకుడే, కాని ఈ హత్య అతడు చేసుండకపోవచ్చు."

"అయితే ఎవరు చేసుంటారు?"

"ప్రస్తుతం నేను చెప్పలేను. త్వరలో మనకు తెలుస్తుంది" అన్నాడు వాలి క్లుప్తంగా.

6

సాయంత్రం ఐదు దాటింది. రిటైర్డు కాలేజి ప్రిన్సిపాల్ సుందరం ముందు వరండాలో కూర్చుని భార్యతో పిచ్చాపాటీ మాట్లాడుతున్నాడు. అతడి చేతిలో దినపత్రిక వుంది.

"సార్!" అన్నారెవరో.

సుందరం అటువైపు చూశాడు. చిరిగిన పంచ, షర్టు ధరించిన వ్యక్తి నిలబడి ఉన్నాడు. నల్లటి గడ్డం.

కళ్ళజోడుగుండా సుందరం అతడివైపు చూశాడు. అలా చూస్తూనే ఉన్నాడు.

"ఏం కావాలి?"

"విజయవాడనుంచి వచ్చానయ్యా. మీరు ఏదేనా పని చేసుకుంటూ జీవిస్తాను. తిండిపదేసి మీకు తోచింది ఇవ్వండి" అన్నాడతను.

"నీ పేరు?"

"గోపాలం, సార్."

ఇందిరానగర్‌లో సుందరం ఇల్లు రోడ్డు చివర్న వుంది. అతడు భార్యవైపు చూశాడు.

"ఏమంటావే?"

భార్య సుమతి దూరంలో నిలబడిన అతడి వైపు చూసింది. అతడు కష్టంలో ఉన్నట్లున్నాడు.

"చూడు వున్నదేదో పెడ్తాం. పనిలో చేరినతర్వాత యిదీ అదీ కావాలని అడక్కూడదు!"

"అడగనమ్మా!"

"అయితే అలా వెనక్కురా. అక్కడ పొయ్యివుంది నీళ్ళు తోడుదువుగాని" అందామె.

అతడు పక్కకు తిరిగి వెళ్ళిపోయాడు. ఆమె లోపలకు వెళ్ళింది. ఏం చెయ్యాలో అంతా చెప్పి ఆమె భర్త దగ్గరకు తిరిగి వచ్చింది.

"పట్నంలోని నౌఖర్లు మరీనెత్తెక్కి కూర్చుంటున్నారు. ఇటువంటివాడు దొరకటం మంచిదే!" అందామె.

"నీ అదృష్టాన్ని చూసి అప్పుడే మురిసిపోకు! ఇప్పుడు వాడు దీనస్థితిలో వున్నాడు. నాలుగు ముద్దులు లోపల వెళ్ళాక తెలుస్తుంది. మూడు రోజులు నువ్వు పెట్టిన తిండి తిన్నాక పీడికి కొమ్ములు వస్తాయి" అన్నాడు సుందరం.

ఆమె కిలకిల నవ్వింది.

"అందరూ అలా ఉండరండీ. ఏదో కష్టంలో

ఇరుక్కుని వీడు ఇంతదూరం వచ్చుంటాడు. కాస్త తిండి పడేసి నెలకో అయిదు రూపాయలు చేతిలోపెడితే సంతోషిస్తూ పడుంటాడు."

సుందరం దినపత్రికలను చూస్తూ ఉండిపోయాడు.

"బావిలోంచి నీళ్ళు తోడుతూంటే చేతులు పడిపోతున్నాయి" అని ఆమె లోపలకు పరుగెత్తింది.

7

మిస్ గీత రిసీవరు్నందుకుంది.

"హలో! రావు అండ్ రవూఫ్ అడ్వర్టయిజింగ్ కంపెనీ!" అందామె.

"గీతా, నేను!" అందో పురుష కంఠం అటువైపు తగ్గు స్వరంలో.

"హలో, గోపాల్?"

"యస్ డార్లింగ్! నీతో రహస్యంగా అర్జెంటుగా మాట్లాడాలి. ఎక్కువసేపు నీతో ఉండలేను. పరిస్థితులు నీకు తెలుసుగా?"

"తెలుసు."

"రాత్రి ఏడింటికి నువ్వు బుహారీ హోటల్ వైపురా. నేను బ్లూ ఫియట్ కారులో స్టీరింగ్ వీలు వెనుక కూర్చునుంటాను. కారు నంబరు TNM 52487. గుర్తుంటుందా?"

"గోపాల్, నేను రాను. నాకు భయంగా వుంది."

"నాకు భయంగా లేదా? కలుసుకుంటే మనకు ధైర్యంగా ఉంటుంది."

"ఆల్ రైట్ వస్తాలే."

"కారులో తిరుగుతూ మనం కాస్సేపు మాట్లాడుకుందాం."

"గోపాల్, ఆ కారెవరిది?"

"ప్రస్తుతం ఒక ఫ్రెండుది. త్వరలో మనదవుతుంది."

అటువైపు నుంచి రిసీవర్ పెట్టిన శబ్దం వినిపించింది. మిస్ గీత రిసీవర్ని పెట్టేసి తనలో తను నవ్వుకుంది.

రోడ్డు లైట్లు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. ఆమె పేవ్ మెంట్ మీద వయ్యారంగా నడుస్తోంది. ఇటూ అటూ కదిలే జనంతో పేవ్ మెంట్ కిటకిటలాడు తోంది.

బుహారీముందు నుంచి వెళ్తూ ఆమె తన వాచ్ వైపు చూసింది. టైము ఏడయింది. ఎన్నో కార్లు పేవ్ మెంట్ వారగా ఆపబడి వున్నాయి. ప్రతీ కార్ని చూస్తూ ఆమె ముందుకి కదులోంది.

బ్లూ ఫియట్! అదే నంబరు!

ఆమె వేగంగా కారువైపు నడిచింది. ముందు తలుపు తెరవబడింది. ఆమె ఎక్కి కూర్చుంది. తటాలున కారు దూసుకుపోయింది.

కారు కదిలాక ఆమె ఓరగా పక్క వ్యక్తి వైపు చూసింది. ఆమె గుండె దడదడలాడింది.

అజానుబాహువైన వ్యక్తి డ్రయివర్ సీటులో ఉన్నాడు. బుగ్గ మీసాలు? నోట్లో చుట్ట!

ఆమె భయంతో అరవబోయింది.

"అమ్మాయి, అరవకు! నేను డిటెక్టివ్ వాలిని!" అన్నాడతను గంభీరంగా.

8

ఇంటిముందు కారు, వెనకనే పోలీసు జీప్ ఆగింది. వాలి, గిరి, ఇన్ స్పెక్టర్ రామదాస్, కొందరు కాన్ స్టేబుల్సు కిందకు దిగారు.

సుందరం వాళ్ళకెదురుగా వచ్చాడు.

"నమస్కారాలు మీకు! మీకు కావలసిన వ్యక్తి బాత్ రూమ్‌లో స్నానం చేస్తున్నాడు. బయటవుంటే మిమ్మల్ని చూసి పారిపోతాడని నేనే స్నానం చెయ్యమన్నాను" అన్నాడు సుందరం.

"మంచి పని చేశారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

నలుగురు కాన్‌స్టేబులను బాత్ రూమ్ బయట కాపలా ఉండమని పంపాడు ఇన్‌స్పెక్టర్ రామదాస్.

"ఇన్‌స్పెక్టర్ గారూ, ఆ రెండు వేల రివార్డునకు వచ్చేటట్లు చూడాలి!" అన్నాడు సుందరం.

"అంకినీడుని పట్టిచ్చినవాళ్ళకు తప్పక రెండు వేలూ వస్తాయి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

లోపలనుంచి అరుపులు వినబడ్డాయి. కాస్సేపట్లో అంకినీడుని హాల్లోకి కాన్‌స్టేబుల్సు యీడ్చుకొచ్చారు.

వాలి, ఇన్‌స్పెక్టర్ రామదాస్, గిరి అతడిముందుకు వెళ్ళారు.

"చంద్రమతిని హత్య చేసినందుకు నిన్ను అరెస్టు చేస్తున్నా" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నేనామెను చంపలేదు, సార్" అర్చాడతను.

"ఏం జరిగిందో చెప్పు" అన్నాడు వాలి.

"నేను నేరస్థుడినని మీకు తెలుసు. నేను ఏం చెప్పినా మీరు నమ్మరు!"

"నమ్మినా, నమ్మకపోయినా నిజం తెలియాలి" అని వాలి అతడి వంక చూశాడు.

అతడు వాలి వైపు చూసి చేతులెత్తి నమస్కరించాడు.

"ప్రఖ్యాత డిటెక్టివ్ వాలిగారు మీరే అనుకుంటాను.

మీరీపాటికి నిజం తెల్సుకునే ఉంటారు. జరిగింది మీరే చెప్పండి!"

చుట్టు పీలుస్తూ వాలి నలువైపులా చూశాడు. అందరి చూపు వాలిమీదే వుంది.

"12-30 ప్రాంతంలో చంద్రమతి నిన్ను మురుగన్ స్టోర్స్‌కు పంపింది. నీకు వందరూపాయిలు యిచ్చింది. వస్తువులు కొని నువ్వు తిరిగొచ్చేసరికి ఒంటిగంట అవుతోంది. పడగ్గదిలో ఆమె చచ్చిపడుంది. నువ్వు హడిలిపోయావు. అక్కడ ఉండటం నీకు ప్రమాదకరం. పోలీసులు వస్తారు. తలుపు మూసి తాళంవేసి నువ్వు పారిపోయావు. తాళం వేయటం మూలంగా శవాన్ని ఎవ్వరూ తొందరగా చూడరని నీ ఉద్దేశం. దూరంగా పోడానికి నీకు టైమ్ దొరుకుతుంది" అని వాలి ఆగాడు.

"మీరు చెప్పినదంతా నిజమే. కాని ఒక విషయం మీరు వూహించలేదు. నేను స్టోర్స్‌కు వెళ్ళేముందు ఎవరో ఆమె పడగ్గదిలో ఉన్నారు. ఆ వ్యక్తి ఎవరో నేను చూడలేదు. ఆమె హాల్లోకొచ్చి డబ్బిచ్చి నన్ను పంపేసింది. రోడ్డుమీద ఒక ఆటో ఆగివుంది. అది నేను పనిచేసే ఇంటికి కొంచెం దూరంగా ఆపబడింది. నేను తిరిగొచ్చేసరికి ఆటో లేదు. కొన్న వస్తువులు వంటింట్లోని బల్లమీద పెట్టి మిగిలింది ఇద్దామని పడగ్గది గుమ్మంలో నిలబడి ఆమెను పిల్చాను. ఎంతకీ పలక్కపోతే లోపలకు చూశాను. ఆమె శవం చూసి భయపడిపోయాను. తర్వాత మీరు చెప్పినట్లే అంతా జరిగింది."

"ఆమె ఒంటిమీద నగలున్నాయా?"

"లేవు సార్."

"ఆమె పడగ్గదిలో ఉన్నవాడే హంతకుడై వుండాలి"

అన్నాడు ఇన్‌స్పెక్టర్ రామదాస్.

"ఎవరతను?" అన్నాడు గిరి.

"అతడి కోసం మనం మరో చోటకు వెళ్ళాలి!" అన్నాడు వాలి గంభీరంగా.

9

ఇంటిముందు XYZ కారు ఆగింది. వెనకనే పోలీస్ వాన్ పార్క్ చేయబడింది.

వాలి, గిరి లోపలకు వెళ్ళారు. పడగ్గదిలోంచి బయటకొచ్చాడు గోపాలరావు.

"నమస్కారం వాలిగారూ! హంతకుడు దొరికాడా?"

"దొరక్కుండా పోతాడా?" అన్నాడు వాలి.

ఇన్‌స్పెక్టర్ రామదాస్ బేడీలు వేసిన అంకినీడును హాల్లోకి తీసుకొచ్చాడు. అతడివైపు కసితో చూశాడు గోపాలరావు.

"వాలిగారూ, హంతకుడిని ఇంత తొందరగా పట్టుకున్నందుకు మీకు నా జోహార్లు!" అన్నాడు గోపాలరావు.

అతడి వైపు సూటిగా చూశాడు వాలి. చుట్ట పొగను గుప్పున బయటకు వదిలాడు.

"మిస్టర్ గోపాలరావు! చంద్రమతి హంతకుడెవడో నేను చెప్తే నువ్వు నీ జోహార్లను దిగమింగేస్తావు!"

"వాలిగారూ, ఏమిటి మీరనేది?"

"అమాయకురాలైన నీ భార్యను అమానుషంగా హత మార్చావు! ఆ నేరాన్ని అంకినీడుమీదకు తోయాలని చూశావు!"

"వాలిగారూ, ఈ హత్య గురించి నాకేమీ తెలియదు. నేను నర్సింగ్ హోమ్‌లో వున్నాను!"

"పన్నెండింటికి నర్సింగ్ హోమ్ వదిలి ఆటోలో ఇక్కడికొచ్చావు. అంకినీడు చూడకుండా నీ భార్య గదిలో ప్రవేశించావు. నీ భార్య చేత అంకినీడుకు వంద రూపాయలు ఇప్పించి మురుగన్ స్టోర్స్‌కు పంపేశావు. యింట్లో ఎవ్వరూ లేరు. నీ భార్యను చంపి, కత్తిని నూతిలో పారేశావు. నగలు పట్టుకుని ఆటోలో వెళ్ళిపోయావు!"

"అదంతా అబద్ధం! ఎవ్వరూ నమ్మకండి!"

"గోపాలరావు, ఈ నేరం అంకినీడు మీదకు వెళుందని నువ్వు వూహించావు. నీ ఇంట్లో పనికి చేరిన అంకినీడు హంతకుడని గ్రహించి యీ హత్యావిధానాన్ని ఆలోచించావు!"

"అంతా అబద్ధం! మీరు చెప్పేదానికి ఋజువులు లేవు!"

"రోడ్డుమీద నువ్వు ఉపయోగించిన ఆటో వుంది. పిలిస్తే డ్రయివర్ లోపలకొస్తాడు" అని వాలి బయటకు చూశాడు.

"నా భార్య నగలు ఏమయ్యాయి?"

"నర్సింగ్ హోమ్‌కొచ్చిన మిస్ గీతకు అవి నువ్విచ్చావు. ఆమె బయట వున్న పోలీస్ వాన్‌లో వుంది! నగలు ఆమె దగ్గరున్నాయి."

గోపాలరావు నోటమ్మట మాట రాలేదు. అతడు సోఫాలో కూలిపోయాడు.

వాలి సగర్వంగా ఇన్‌స్పెక్టర్ వైపు తిరిగాడు.

"రామదాస్ భాయ్ అదుగో చంద్రమతి హంతకుడు! అరస్టు హిమ్!" గర్జించాడు వాలి.

ఇన్‌స్పెక్టర్ రామదాస్, ఒక కానిస్టేబులు గోపాలరావు వైపు అడుగు లేశారు.

—:ఐపోయింది:—